
# ప్రజల మెడలో స్టెతస్కోపు ఆమెడ నారాయణ

సెప్టెంబరు 25, 1996న వరంగల్‌లో వినాయక నిమజ్జనం జరిగే రోజు. భారీ బందోబస్తుతో వినాయకున్ని ఊరేగించడానికి జిల్లా పాలక యంత్రాంగం అదనపు పోలీసు బలగాలతో సిద్ధమైంది. ఇవాళ రేపు వినాయకుల్ని, నాయకుల్ని ఊరేగించడానికి పోలీసు బందోబస్తు తప్పనిసరిగా వుండవలసిన పరిస్థితి ఏర్పడింది. నక్సలైట్లచే చంపబడిన కానిస్టేబుల్ భీంసింగ్ శవయాత్రను కూడా పోలీసు యంత్రాంగం అప్పుడే చేయ పూనుకుంది. ఈ రెండు ఊరేగింపులకు పోలీసు బలగాలను సిద్ధం చేసిన పోలీసు అధికారులే ఓ ఘాతుకాన్ని చేయడానికి కూడా ఆదేశాలు యిచ్చారు. పైస్థాయి అధికారుల ఆదేశాలు అందుకున్న నక్సలైటు ఏరివేత పోలీసు దళం ఎనుమాముల దగ్గర మాటువేసి వుంది. తాము చంపాలనుకున్న డాక్టర్ ఆమెడ నారాయణ కోసం ఎదురు చూస్తూ కూర్చుంది. కాకతీయ యూనివర్సిటీ దగ్గరగల పోచమ్మకుంటలోని తన ఇంటినుండి అతడు ప్రతిరోజు ఉదయం 7 గంటలు దాటకముందే బయలుదేరుతాడని, తన ఇంటికి 15 కిలోమీటర్ల దూరంలో వున్న మొగిలిచెర్లకు ప్రతిరోజు 7.30 దాటక ముందే చేరుతాడని పోలీసులు గత సంవత్సర కాలంగా గమనిస్తూనే వున్నారు.



1982లో MBBS పూర్తిచేసిన ఈ డాక్టర్ తన ప్రవృత్తికి తగినవిధంగా వృత్తి ధర్మాన్ని నెరవేర్చాలనే కృతనిశ్చయంతో 1984లో మొగిలిచర్లలో క్లినిక్ ప్రారంభించాడు. ప్రజల ఆకలికి, ఆరోగ్యానికి సంబంధాన్ని గమనించిన ఈ డాక్టర్ రోగులతో సన్నిహిత సంబంధం కోరుకుని మొగిలిచర్లకు చేరుకున్నాడు. పాత ఇంటిలో కొందరు యువకుల సహకారంతో ఒక టేబులు, రెండు బెంచీలతో ప్రజా వైద్యశాల ప్రారంభించిన తర్వాత వెనుతిరగకుండా ప్రజలలో కలిసిపోయాడతను. గ్రామాల్లో డాక్టరంటూ వుండాలే కాని రోగులకు కొదవుండదు. చాలా కొద్దికాలంలోనే అతనికి మొగిలిచర్లతో విడదీయరాని బంధం ఏర్పడింది. తన 12 సంవత్సరాల వైద్యసేవలో రోగులనుండి మొదటి ఆరు సంవత్సరాలు కేవలం మూడు రూపాయలే తీసుకొనేవాడు. ఆ తర్వాతనుండి చనిపోయేనాటి వరకు 5 రూపాయలు తీసుకొనేవాడు. ఈ 5 రూపాయలు కూడా రోగి యిచ్చినప్పుడే, రోగికి సూదిమందివ్వవలసి వస్తేనే తీసుకొనేవాడు. డాక్టరే మందివ్వాలనే ప్రజల పట్టుదలవల్ల ఆయన చేతివేళ్లు కాయలు కాచాయి. బహుశా ఒక డాక్టరుకు చేతివేళ్లు కాయలుకాచిన మాట మనం విని వుండము.

మొగిలిచర్లలో వున్న పదకొండేళ్లు - కనీసం పండుగలలో కూడా శలవు తీసుకొనేవాడు కాదు. ఏ క్షణమైనా, ఏ రాత్రైనా రోగికి అందుబాటులో వుండేవాడు. ప్రతిరోజు ప్రతి ఇల్లు తిరిగి క్షేమసమాచారాలు అడుగుతూ రోగులకు వైద్యం చేసేవాడు. ఏ రోగైనా ఎప్పుడైనా తనకోసం ఎదురుచూసే పరిస్థితివస్తే ఎంతో మథనపడేవాడు. తాను తప్పు చేసినట్లుగా భావించేవాడు. సీజన్లను దృష్టిలో వుంచుకొని కావలసిన మందులన్నీ ముందే తెప్పించేవాడు. కొన్ని సందర్భాలలో వాసాలకు గ్లూకోజు సీసాలు కట్టి రోగులను వరుసగా కూర్చుండపెట్టి వైద్యంచేసిన అనుభవాలు ప్రజలు చెప్పుకుంటారు. ఎడతెరిపి లేకుండా వైద్యం చేస్తూ ఎప్పుడూ చెమటలు పోస్తూ కనిపించేవాడు. ఆ ఊళ్లోని ముసలివాళ్లకు, ఎవరూలేని అనాథలకు తనే సర్వస్వమై సేవలందించేవాడు. ఇంతటి ఖచ్చితమైన నియమాలతో ఆ డాక్టరు పనిచేస్తాడని కూడా పోలీసులకు తెలుసు. 1995 జూన్‌లో 'నువ్వు గ్రామంలో వుండొద్దు. ఇక్కడ వైద్యం చెయ్యొద్దు' అని ఒత్తిడి చేసినప్పుడు 'మొగిలిచర్లలో చస్తాను కాని వైద్యం చేయడం మానను' ని ఖరాఖండిగా చెప్పాడు. అందుకే పోచమ్మకుంటలోని స్వంత ఇంటిలో వున్నా సూర్యోదయంతోనే గ్రామానికి చేరేవాడు. సరిగ్గా సెప్టెంబరు 25కు నెలరోజుల ముందు రాత్రి 10 గంటలకు మొగిలిచర్లనుండి వస్తున్న తనను మధ్యలో గుంటూరుపల్లి దగ్గర పోలీసు అధికారులు ఆపి 'అసలు గ్రామంలో వైద్యం చెయ్యొద్దంటే చేయడమేకాక ఇప్పటిదాక వైద్యం చేస్తున్నావు. నీ చిట్టా అంతా మాకు తెలుసు, నీ సంగతి చెబుతాము' అని బెదిరిస్తే మౌనంగా విని ఇంటికి చేరాడు. ఐనా ఉదయం 7 గంటలకల్లా మొగిలిచర్ల చేరుకున్నాడు. తనను మృత్యువు వెంటాడుతున్నదని గమనించినా వైద్యం మానడం ద్రోహమని ఎంచాడు.

పోలీసుల ఒత్తిడి వలన బంధుమిత్రులు డాక్టర్‌ని ఆ ఊరిలో వైద్యం మాని హన్మకొండలో క్లినిక్ ప్రారంభించమని బలవంతపెట్టారు. గత రెండేళ్లుగా తనను ఒప్పించడానికి ప్రయత్నిస్తున్న బంధుమిత్రులకు తన నిబద్ధతతో నిరాశనే మిగిల్చాడు. 'నేను ప్రజలకు వైద్యం చేయడానికి ఆ ఊరికెళ్లాను. డాక్టర్‌గా సంపాదించుకోవడానికి కాదు. నన్ను, నా వైద్యాన్ని నమ్ముకున్న ప్రజలు నన్ను వారిలో కలుపుకున్నారు. నామీద ఎంతో ఆశపెట్టుకొని వుంటారు. పోలీసులు బెదిరిస్తున్నారని ఆ ఊరు విడిచి రావడమంటే నన్ను నేను కాపాడుకోడానికి వేలమందికి ద్రోహం చేయడమే. ఆ ఊరిలో వుండి నేను చచ్చినా నా కోసం ఏడ్చేవాళ్లు వేలమంది వుంటారు. కాబట్టి నాకు ఆ చావే గొప్ప. అప్పుడే నా వృత్తికి, నాకు సార్థకత లభిస్తుంద'ని తెగేసి చెప్పాడు. అందుకే ప్రజలే దేవుళ్లని నమ్మిన ఆ డాక్టర్ యివ్వాళ ఆ ప్రజలకే దేవుడుగా మారాడు.

వర్షమొచ్చినా, వరదలొచ్చినా, బందులున్నా, బందూకులున్నా డాక్టరు ఉదయం ఏడింటికల్లా మొగిలిచర్ల రోడ్డుపై వుంటాడు. పోలీసుల రివాల్వర్‌లోని తూటా గురి తప్పుతుందేమో కాని నిబద్ధత కలిగిన డాక్టర్ డ్యూటీ తప్పడని పోలీసులకు తెలుసు. అందుకే ముగ్గురు పోలీసులు

ఎనుమాముల మార్కెట్ దాటిన తర్వాత వచ్చే కుడివైపు బావిదగ్గర డాక్టర్‌ని చంపడానికి పొంచివున్నారు. తాము అనుకున్నట్లుగా డాక్టర్ అప్పటికే రావాలి కాని ఇంకా రాలేదు. ఆనాటి ఆలస్యానికి కారణముంది. కొద్దిరోజుల్లో జరగనున్న ఐ.ఎం.ఏ ఎన్నికలలో పోటీ చేయడానికి రిటర్నింగ్ ఆఫీసర్ డాక్టర్ సంపత్ రాజారామ్ దగ్గర నారాయణ ఆ ఉదయం నామినేషన్ పత్రాలపై సంతకం చేసాడు.

అప్పటికే 15 నిమిషాలు ఆలస్యమైందని గమనించిన డాక్టర్ నారాయణ సంతకం చేసిన వెంటనే 'ఇక నేను వెళ్తాన'ని లేచాడు. 'ఈ రోజు నామినేషన్ వేసావుకదా. ఎట్లాగూ ఆలస్యమైంది. టిఫిన్ చేసి వెళ్లమ'ని సంపత్ రాజారామ్ అన్నా కూడా 'లేదు నేను వెంటనే వెళ్లవలసిందేన'ని మొగిలిచర్లకు బయలుదేరాడు. ఈ కారణంగానే 15 నిమిషాల ఆలస్యంతో ఎనుమాములకు చేరాడు. ఫర్లాంగుదూరం వుండగానే గమనించిన పోలీసులు డాక్టర్‌ని ఆపే డ్రామా మొదలుపెట్టారు.

ప్రతిరోజూ ఏడు గంటలకే ఆ రోడ్డు వెంబడి వెళ్లే డాక్టర్‌ను ఎవరో ఒకరు ఆపి వైద్యం చేయించుకుంటారు. ఇలా ఎక్కడ పడితే అక్కడ, ఎప్పుడు పడితే అప్పుడు వైద్యంచేసే వృత్తిధర్మాన్ని పోలీసులు డాక్టర్‌ని చంపడానికి సాకుగా తీసుకున్నారు. దగ్గరకొస్తున్న స్కూటర్‌ని చూసి ఒక యువకుడు కడుపునొప్పి నటిస్తూ ఆగమని సైగచేసాడు. తను మామూలుగా నిర్వహించే డ్యూటీయే కదానని స్కూటరాపి విషయమడిగి తెలుసుకున్నాడు. తనకు కడుపులో బాగా నొప్పి పుడుతున్నదని అతను మెలికలు తిరుగుతూ పడిపోయాడు. నిజమేననుకొని గబగబా తన కిట్‌లోనుండి ఇంజక్షన్ తీసి మందును ఎక్కించాడు డాక్టర్ నారాయణ. ఇంతలో అప్పటివరకు బావిదగ్గర నక్కిన పోలీసులు దగ్గరకొచ్చి రివాల్వర్‌తో ఛాతీపై పేల్చారు. చేతినడ్డం పెట్టాడు డాక్టర్. ఆ తర్వాత కణతలో కాల్చి చనిపోయాడని నిర్ధారించుకున్న తర్వాత మోటార్‌సైకిళ్లపై పారిపోయారు. కొద్దిక్షణాల తర్వాత డాక్టర్ చంపబడ్డాడని మొగిలిచర్ల ప్రజలకు తెలిసింది.

తమ కనురెప్పను పీకిపారేసారని, తమ గుండెచప్పుడు ఆగిపోయిందని ప్రజలకు తెలియడానికి ఎంతోసేపు పట్టలేదు. ఎక్కడున్నవాళ్లు అక్కడినుండే ఎలా వున్నవాళ్లు అలాగే సరుగుతీసారు. ట్రాక్టర్లు వేసుకొని జనం ఒక గంటలోనే 15 వేలమంది పోగైనారు, మీదపడి ఏడ్చారు. ఏమీ ఎరుగనట్లు శవందగ్గరికి పంచనామా చేయడానికొచ్చిన పోలీసుల్ని తరిమారు. పోలీసులు ఖంగుతిన్నారు. ఇంత తొందరలో ఇన్ని వేలమంది జనం పోగౌతారని వాళ్లూహించలేదు. పోగైన జనం తమ మీదకు తిరగబడ్తారని కలలో కూడా అనుకోలేదు. ఆడవాళ్లు పోలీసులమీద మన్నెత్తి పోసారు. పరిస్థితి చేయిదాటుతున్నదని గమనించిన పోలీసులు వినాయక నిమజ్జనం కోసం ఏర్పాటుచేసిన పోలీసు బలగాన్నంతా క్షణాలమీద రప్పించుకున్నారు. డాక్టర్ శవంచుట్టూ నిలబడ్డ జనంమీద విచక్షణారహితంగా లాఠీఛార్జి చేశారు. ఆడవాళ్లు, ముసలివాళ్లు, పిల్లలు అని చూడకుండా అందరినీ కుంటలోకి నెట్టివేసారు. ఆ దారిగుండా వడవడాన్ని నిషేధించారు. శవాన్ని గాంధీ దవాఖానకు తీసుకెళ్లారు. పోలీసు వాహనాలు పల్లెలకు చేరుకున్నవి. ఎవర్నీ రోడ్డుమీదకు రానీకుండా చేసారు.

డాక్టర్‌ని చంపింది పోలీసులేనని ప్రజలంటున్నారని పత్రికలు ప్రశ్నిస్తే 'మేమెందుకు చంపుతాము? ఆయన నేరస్థుడు కాడు, పౌరహక్కుల సంఘం కార్యకర్త కాదు, నక్సలైటు కాదుగదా?' అని ఎదురు ప్రశ్నించారు పోలీసులు. వరంగల్ పోలీసులు పౌరహక్కుల సంఘం వాళ్లను, నేరస్థులను, నక్సలైట్లనూ చంపుతారని, అది చట్టబద్ధమేనని అహంకారపూరిత ధ్వని వుంది పోలీసు అధికారుల మాటలలో. ఇంతకీ డాక్టరెవరు? ఆయన్ని పోలీసులు ఎందుకు చంపినట్లు?

కురవి దేవుని పేరుమీద వున్న కురవిగ్రామంలో 1957లో మహాలక్ష్మి, ముత్తయ్యలకు జన్మించాడు నారాయణ. వీళ్లకున్న ఆరుగురు సంతానంలో డాక్టర్ రెండవవాడు. డాక్టర్ తర్వాత ముగ్గురమ్మాయిలు, ఒక అబ్బాయి. ముత్తయ్యకు 12 సంవత్సరాల వయసప్పుడే తండ్రి పెళ్లిచేసాడు. ముత్తయ్య కుమ్మరికులంలో పుట్టినా వృత్తి తెలియదు. పన్నెండేళ్లకే తన భార్యను, ఇద్దరు తమ్ముళ్లను సాదాలంటే కుమ్మరిసారె తిప్పడం తప్ప గత్యంతరం లేదని గ్రహించి వృత్తిలో నైపుణ్యాన్ని కొద్దికాలంలోనే సంపాదించాడు. ఇక అప్పటినుండి బతుకుబండిని ముందుకు నడిపించాడు. ఆ ఊళ్లోవున్న అయిదు కుమ్మరి కుటుంబాలు గ్రామానికంతటికీ మట్టిపాత్రలు చేసివ్వాలి. పంటలకాలంలో రైతుల నుండి 'బిచ్చాన్ని' తెచ్చుకోవాలి. దీనికితోడు లంబాడ తండాలకు కావలసిన కుండలు, పాత్రలు తయారు చేసేవాళ్లు. ప్రతి వారం కురవిలో జరిగే సంతలో కుండల్ని అమ్ముకొని రైతులిచ్చే బిచ్చానికి సంతలో సంపాదించేవి పెచ్చులుగా కలుపుకుని సంవత్సరమంతా గడపాలి. ఇలాంటి సంపాదనతోనే తన పెద్దకొడుకు నాగయ్యను హయ్యర్ సెకండరీ చదివించాడు. నాగయ్య ప్రథమశ్రేణిలో పాసైనా కుటుంబ చక్రం ముందుకు సాగాలంటే తండ్రికి తోడుండాల్సిందేనని నిర్ణయించుకొని కనీసం తమ్ముడ్నైనా పైచదువులు చదివించాలనుకున్నాడు. తండ్రికి సాయపడ్తూనే టైలరింగు నేర్చుకున్నాడు నాగయ్య.

ఊరుకు, తండాలకు, ప్రతివారం జరిగే సంతలో అమ్ముకోడానికి కావలసిన కుండలు చేయడానికి సంవత్సరంలో కేవలం ఎండాకాలమే అనువైన కాలము. ఆ మూడునెలలు ఖచ్చితంగా నడుమెత్తకుండా పనిచేస్తేనే భారతదేశ అభివృద్ధిలో కుంచించుకుపోయే కుండల మార్కెట్టులో తన వాటాను కాపాడుకోగలుగుతాడు ముత్తయ్య. మిగతా ఋతువుల్లో వ్యవసాయ పనులకు వెళ్లేవాళ్లు కుటుంబ సభ్యులంతా. ఇలా తండ్రి సారె తిప్పడానికి కావలసిన రేగడి మట్టిని తీసుకురావడంలో, దానిని మెత్తగా చేయడంలో, నానబెట్టడంలో, దట్టిపెట్టడంలో సాయమందిస్తూనే 10వ తరగతి పూర్తిచేసాడు ముత్తయ్య రెండవకొడుకు నారాయణ. 10వ తరగతి పరీక్షలు రాసేముందు స్కూలులో హెడ్‌మాస్టర్ విద్యార్థులందరినీ సమావేశపర్చి భవిష్యత్తులో మీకేమి కావాలని వుందని ప్రశ్నించాడు. విద్యార్థులందరూ తమలో అప్పుడప్పుడే రూపుదిద్దుకుంటున్న ఆశయాల గురించి చెప్పారు. నారాయణ సంవత్సరకాలం క్రితమే తన స్నేహితున్ని ఆసుపత్రికి చికిత్సకోసం తీసుకుపోయినప్పుడు డాక్టరు వృత్తికున్న ప్రత్యేకత, విలువలు గ్రహించి తానుకూడా డాక్టరైతే బాగుంటుందికదా అని అనుకున్నాడు. ఇప్పుడు ఏకంగా హెడ్‌మాస్టర్‌గారే నీవు ఏమౌతావు అని ప్రశ్నించగా చాలా భయంగా, బెరుగ్గా లేచి 'సార్... నేను డాక్టర్ నవుతాన'ని జవాబిచ్చాడు. ఈ జవాబు విన్న ఉపాధ్యాయులంతా గొల్లున నవ్వారు. 'కుండలు చేసేవాడివి వైద్యమెలా చేస్తావురా? నీ అన్న హయ్యర్ సెకండరీ చదివినా టైలర్ టేపు మెడలో వేలాడేసుకున్నాడు. నీవు స్టెతస్కోపు ఎలా వేస్తావు?' అని హేళనగా ప్రశ్నించారు. ఈ ప్రశ్నలకు భయపడ్డా పట్టుదలతో 'నేను డాక్టరునవుతాను, అంతేన'ని చెప్పి ఇంటికి వెళ్లి అన్నతో జరిగినదంతా చెప్పాడు. తమ్ముడి

కోరికను, దానివెనకున్న పట్టుదలను గ్రహించిన అన్న 'నీవు తప్పకుండా డాక్టరువవుతావు' అని ధైర్యాన్నిచ్చాడు. ఇలా నారాయణ డాక్టర్ నారాయణగా మారడానికి పునాదిపడ్డది.

చదువుకున్న వ్యక్తిగా నాగయ్యను ఆ ఊళ్లో, వారి కులంలో బాగా గౌరవించేవాళ్లు. నాగయ్య సిపిఎం పార్టీలో సభ్యుడు. అన్నమీదగురి, గౌరవం తమ్ముళ్లను ఎస్ఎఫ్ఐలో తిరిగేలా చేసింది. నారాయణ ఇంటర్ పూర్తయ్యేసరికి చెల్లెళ్లు ముగ్గురిలో ఇద్దరి పెండ్లి చేసాడు ముత్తయ్య. ఇంటర్ పూర్తయ్యాక ఎంబిబిఎస్ ప్రవేశ పరీక్షకు కూర్చొని మొదటిసారి సీటు సంపాదించుకోలేక పోయాడు. అయినా నాగయ్య ఇచ్చిన ధైర్యంతో మరింత పట్టుదలగా చదివి సీటు సంపాదించుకున్నాడు. ఎంబిబిఎస్ పూర్తి కావడానికి ఓవైపు ప్రభుత్వ స్కాలర్‌షిప్పు, అన్నగారి ఆర్థికసహాయం తోడ్పడింది.

మహబూబాబాద్‌లో ఇంటర్ చదివినప్పుడు, కాకతీయ మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ చదివే కాలంలో మూడు సంవత్సరాలు నారాయణ ఎస్ఎఫ్ఐ విద్యార్థులతోనే తిరిగాడు. ఆ తరువాత రాడికల్ విద్యార్థి సంఘానికి దగ్గరయ్యాడు. కాలేజీ విద్యార్థి సంఘ ఎన్నికల్లో నారాయణను ప్రధాన కార్యదర్శిగా వామపక్ష విద్యార్థి సంఘాలు అన్నీ కలిసి పోటీకి నిలిపాయి.

ప్రజాస్వామ్యమంటే అర్థమూ, పరమార్థమూ ఎన్నికలు జరుపుకోవడమేనని, 'అభివృద్ధి' అంటే పంచవర్ష ప్రణాళికలు ప్రకటించడమేనని మన పాలకులంటారు. ఈ ప్రజాస్వామ్యము, ఈ అభివృద్ధి ప్రజల నాలికమీద వున్న ఆకలి సెగలను చల్లార్చలేదు. గ్రామాలు కొల్లగొట్టబడ్డాయి. భూసంస్కరణలు కాగితాలకే పరిమితమైనాయి. ప్రజలందరికి విద్య, వైద్యం, ఉద్యోగం నీటిమీద రాతలుగా చెరిగిపోయాయి. గ్రామాలకు రోడ్లుండవు, స్కూళ్లుండవు, దవాఖానా వుండదు. పట్టణంలో వున్న ప్రభుత్వ దవాఖానాలో వైద్యం ప్రజలకందదు. దవాఖానా వుంటే డాక్టరుండడు, డాక్టరుంటే మందులుండవు. మందులుంటే రోగులకందవు. ఇలాంటి నేపథ్యంలో గ్రామాలనుండి ఎంబిబిఎస్ పూర్తిచేసుకున్న నిజాయితీ కలిగిన ఏ విద్యార్థైనా తన అవసరం గ్రామాల్లోనే వుందని నిర్ణయించుకోవలసి వుంటుంది. అయితే ఇలాంటి నిర్ణయం తీసుకునేవాళ్లు చాలా తక్కువ. తనకు జన్మనిచ్చిన సామాజిక పరిస్థితులు మారాలంటే తనువాటిని మార్చటానికి ముందుకు సాగాలని, ఏ ప్రజల ఆశలలో ఎదిగాడో ఆ ప్రజల ఆశలకు, ఆశయాలకు తనను తాను అంకితం చేసుకున్నాడు నారాయణ. ఈ విధంగా నిజాయితీగా తన గ్రామాల అవసరాన్ని గుర్తించి విద్యార్థిగా తనను ఉత్తేజితుణ్ని చేసిన రాజకీయాల ప్రోద్బలంతో ఒక డాక్టరుగా ఆయన ప్రజల వద్దకు పోయాడు. డాక్టరు వృత్తి సంపాదనకు ఎంతో అవకాశమున్న వృత్తి. కాని దాన్ని తన భావాలకు అనుకూలంగా ప్రజలకు సేవచేయడానికి మలుచుకున్నాడు.

వృత్తిని ప్రజలపరం చేయాలనుకున్న తర్వాత మిత్రులతో చర్చించి మొగిలిచర్లలో వైద్యశాల తెరవాలనుకున్నాడు. అప్పటికే ఆ గ్రామం రాజకీయ కక్షలకు నిలయం. పీపుల్స్‌వార్, ఎంసిపిఐ, కాంగ్రెస్, బి.జె.పి లాంటి పార్టీలున్నవి. పీపుల్స్‌వార్‌కు, ఎంసిపిఐకి గల ఘర్షణలో గాయపడ్డవాళ్లకు రాజకీయాలతో నిమిత్తం లేకుండా వైద్యం చేసాడు నారాయణ. రోగికి వైద్యం చేసేటప్పుడు వారి రాజకీయాలు అడ్డు రాకూడదని, అలావస్తే వాడు డాక్టరే కాదని నమ్మి ఆచరించినవాడు నారాయణ. అతను పీపుల్స్‌వార్ దళాలకు వైద్యం చేస్తున్నాడని పోలీసుల అనుమానం. అది నిజంకూడ కావచ్చు. ఆ పార్టీ రాజకీయాలపట్ల అతనికి సానుభూతి వున్న మాట వాస్తవమే. కానీ సానుభూతి లేకపోయినా తన వృత్తిధర్మంగా అతను చేసి వుండేవాడే. కానీ పోలీసులు మాత్రం ఆ కారణంగా నారాయణ మీద కోపం పెంచుకున్నారు. ఈ కోపం పెరగడానికి ఇంకొక కారణం - అతని దగ్గర పనిచేసే ఓ అమ్మాయి పీపుల్స్‌వార్ దళంలో కలిసిందని, దానికి నారాయణే బాధ్యుడని పోలీసులు భావించడం. తమ శత్రువైన పీపుల్స్‌వార్‌కు నారాయణ నమ్మకమైన వైద్యుడని పోలీసుల విశ్వాసం. కాబట్టే నారాయణను మొగిలిచర్లలో వైద్యం చేయకూడదని ఆంక్షలు పెట్టారు. ఊళ్లో వుండొద్దనీ, రాత్రుళ్లు వైద్యం చేయొద్దనీ ఒత్తిళ్లు తెచ్చారు. ఈ ఆంక్షలకు, ఒత్తిళ్లకు తలవంచేది లేదని తాను కేవలం వృత్తిధర్మాన్ని పాటిస్తున్నానని, పోలీసుల మాటలకు బెదిరి పట్టణంలో వైద్యం చేసుకొని బతకడమంటే ప్రజలకు వ్యతిరేకంగా లొంగిపోవడమేనని, తన అవసరం గ్రామాలకే వుందని, తాను గ్రామాలకే వైద్యం చేస్తానని ప్రకటించాడు. కాని పోలీసులకు నారాయణలో నక్సలైట్లకు ప్రాణంపోసే వైద్యుడు మాత్రమే కనిపించాడు. పీపుల్స్‌వార్‌కూ పోలీసులకూ మధ్య వరంగల్‌లో జరుగుతున్న పరస్పర దాడులలో భాగంగా నారాయణను చంపాలని పోలీసులు నిర్ణయించుకున్నారు. ఇలా పోలీసులు తీర్మానించు కొనడం కొత్తేమీ కాదు. గత 15 సంవత్సరాలుగా ప్రతి 5 సంవత్సరాలకొకసారి పౌరహక్కుల నాయకులను 'పీపుల్స్‌వార్' ముద్రవేసి చంపిన పోలీసులు ఈసారి నారాయణను చంపాలనుకున్నారు. కానిస్టేబుల్ భీంసింగ్‌ను నక్సలైట్లు చంపినందుకు ప్రతిగా డాక్టర్ నారాయణను చంపారు.

**నారాయణ నిబద్ధత నుండి పౌరహక్కుల కార్యకర్తలు నేర్చుకోవలసింది ఎంతో వుంది. భారత రాజ్యాంగంలో పొందుపర్చబడిన ప్రజాస్వామిక విలువలు - ప్రజల ఆశలకు, ఆకాంక్షలకు ప్రతిరూపాలు. అవి ప్రజలపరం చేయడానికి పౌరహక్కుల కార్యకర్తలు ప్రజల ఆశలలో, ఆకాంక్షలలో కలగలసి పోవలసివుంది. ఈ స్ఫూర్తినే నారాయణనుండి పొందాలి.**

నారాయణ చంపబడ్డాడని తెలుసుకున్న ప్రజలు వెంటనే కనబర్చిన నిరసన అపూర్వం. ఆ నిరసన లోతు, తీవ్రత నారాయణ ఎవరో తెలిపింది. ఉద్యమాలు లేవనెత్తిన ప్రశ్నలకు జవాబివ్వలేని ప్రభుత్వం ఆ ఉద్యమాలనే నేరాలుగా భావించిన ఫలితంగా పోలీసు అధికారులు చేసే నిర్ణయాలు ప్రజల మనుషుల్ని, ప్రజా డాక్టర్లని, ప్రజా న్యాయవాదుల్ని బలితీసుకుంటున్నవి.

నారాయణ నిబద్ధత నుండి పౌరహక్కుల కార్యకర్తలు నేర్చుకోవలసింది ఎంతో వుంది. భారత రాజ్యాంగంలో పొందుపర్చబడిన ప్రజాస్వామిక విలువలు - ప్రజల ఆశలకు, ఆకాంక్షలకు ప్రతిరూపాలు. అవి ప్రజలపరం చేయడానికి పౌరహక్కుల కార్యకర్తలు ప్రజల ఆశలలో, ఆకాంక్షలలో కలగలసి పోవలసివుంది. ఈ స్ఫూర్తినే నారాయణనుండి పొందాలి.